

రీసెర్చ్‌హబ్‌గా వైవీయూ
యోగివేమన విశ్వవిద్యాలయం పరిశోధనలకు పెద్దపీట వేస్తోంది. తాజాగా రూసా 2.0లో భాగంగా రూ.3.49 కోట్లతో 52 ప్రాజెక్టులను మంజూరు చేసింది. -8లో



ఫుట్‌బాల్ జోనల్ చాంపియన్ కడప
కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో గురువారం నిర్వహించిన ఫుట్‌బాల్ జోనల్‌స్థాయి టోర్నమెంట్‌లో విజేతగా కడప జట్టు నిలిచింది. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0/25.6
జిల్లాలో గురువారం 25.6 - 33.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 10.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: కడపలోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గత నెల 27వ తేదీ నుంచి జరుగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్ గురువారం ముగిసింది. పాలిసెట్ వెబ్ కౌన్సిలింగ్‌లో భాగంగా జూన్ 3న జరగాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని కౌటింగ్ నేపథ్యంలో 6వ తేదీ నిర్వహించారు. గురువారం 1,08,000 నుంచి చివరి ర్యాంకు వచ్చిన 215 మంది విద్యార్థులు హాజరయ్యారని, ర్యాంకులు, సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారని పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లును చేసినట్లు ఆమె తెలిపారు.

నేటి నుంచి కళాశాలల ఆప్షన్ల ఎంపిక పక్రియ

కడప ఎడ్యుకేషన్: పాలిసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా శుక్రవారం నుంచి సర్టిఫికెట్లు పరిశీలించుకున్న అభ్యర్థులకు తమకు నచ్చిన కళాశాలల ఎంపికకు సంబంధించి ఆప్షన్లను ఆన్‌లైన్లో చేసుకోవాలని పాలిసెట్ జిల్లా కన్వీనర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. ఎంపిక చేసుకున్న కళాశాలలను మార్పు చేసుకోవాలనుకుంటే 11వ తేదీ చేసుకోవాలని తెలిపారు. 13వ తేదీకల్లా సీట్ల ఆలాంట్‌మెంట్ జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు 14 నుంచి 19వ తేదీలోగా కళాశాలలో జాయినింగ్ రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 14వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు.

ప్రారంభమైన మూల్యాంకనం

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాల మూల్యాంకనం గురువారం కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్‌లో ప్రశాంతంగా ప్రారంభమైంది. ఈ మూల్యాంకనానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 8345 సమాధాన పత్రాలు వచ్చాయని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమీషనర్ వెంకటేష్ తెలిపారు. శుక్రవారంతో మూల్యాంకనం ముగుస్తుందని ఏసీ తెలిపారు. అంతకుముందు మూల్యాంకన కేంద్రాన్ని డీఈఓ డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఏసీ వెంకటేసులతో కలిసి డీఈఓ మర్రెడ్డి అనురాధ పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఐటీఐలలో ప్రవేశాలకు 10 వరకు గడువు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో చేరేందుకు ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఉందని అభ్యర్థుల తమ అప్లికేషన్లను ఆన్‌లైన్‌లో iti.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వ మైనారిటీల ఐటీఐ జిల్లా కన్వీనర్/ప్రిన్సిపాల్ ఎ. జ్ఞానకుమార్ తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అలాగే ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అంతకు మించి విద్యార్హతలు ఉన్న వారు కూడా ఐటీఐలో చేరుటకు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ దగ్గరలోని ఏ ప్రభుత్వ ఐటీఐల వద్దకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ, ఫొటో, ఫోన్ నెంబర్, ఆధార్‌కార్డు, మెయిల్ ఐడితో వెళ్లి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి ఒక్కరు తప్పని సరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. వెరిఫికేషన్ చేయించకుంటే అడ్మిషన్ పొందుటకు అర్హులు కారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సెమిస్టర్ల పరీక్ష ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ తదితరులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం ఎల్ఎల్‌బీ (సీబీసీఎస్ విధానం) 3,5 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ గురువారం విడుదల చేశారు. అనంతరం వీసీ చాంబర్లో రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి మాట్లాడారు. ఎల్.ఎల్.బి ఐదేళ్ల కోర్సులో మూడో సెమిస్టర్ పరీక్షల్లో 50 శాతం, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 74.68 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మూడేళ్ల ఎల్.ఎల్.బి కోర్సు కు సంబంధించి మూడో సెమిస్టర్ లో 67.37 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. అలానే 5వ సెమిస్టర్ లో 70.55 శాతం మంది పాసయ్యారని తెలిపారు. వీటితోపాటు ఎల్.ఎల్.బి (ఐదేళ్ల డిగ్రీ) 7,9 సెమిస్టర్ ఫలితాలు వెల్లడించారు. 7 సెమిస్టర్ లో 87.32 శాతం మంది, 9 సెమిస్టర్ లో 80.34 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ విభాగ సహాయ అధికారి డాక్టర్ గంగయ్య పాల్గొన్నారు.

చుక్‌చుక్ రైలు వస్తుందా!

- సింహపురికి రైలెప్పుడో!
- కేవలం గూడ్స్‌రైళ్లకే పరిమితం..
- సౌత్‌ఇండియాకే తలమానికమైన లైన్
- ఐదేళ్లైనా కనిపించని ప్యాసింజర్ రైలు



వెలుగొండ అడవుల్లో టన్నెల్ రైలుమార్గం

రాజంపేట: వెలిగొండ అడవుల్లో సౌత్ ఇండియాకే తలమానికంగా నిలిచిన కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైల్వేలైన్(విజయవాడ డివిజన్) ప్రయాణానికి దూరంగా ఉంది. నిత్యం ఉభయ జిల్లాల నుంచి సింహపురి(నెల్లూరు)కి బస్సులు రద్దీగా నడుస్తున్నాయి.బద్వేలు, రాజంపేట నుంచి రాపూరు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణపట్నం రైల్వేలైను అందుబాటులోకి వచ్చి ఐదేళ్లవుతున్నా ప్యాసింజర్ రైలును పట్టాలెక్కించలేదు. ఈలైన్ 2005లో మంజూరైంది. 113 కిలోమీటర్ల పొడవు కలిగిన లైను తొలి అంచనా రూ.930కోట్లతో ప్రారంభమై రూ.6,660 కోట్లతో అందుబాటులోకి వచ్చింది. 2019 సెప్టెంబర్ 1న రైలును ప్రారంభించారు.ఐదేళ్లవుతున్నా ప్యాసింజర్ రైలు నడిచేలా కనిపించడంలేదు. మూడోసారి బీజేపీ సర్కారు పాలనలోకి వచ్చినప్పటికి ఈ రైలుమార్గంలో మాత్రం రైలు ప్రయాణానికి మోక్షం లభిస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

- ఓబులవారిపల్లె-కృష్ణపట్నం రైల్వేలైన్ గూడ్స్‌రైళ్లకే పరిమితమైంది. వెంకయ్యనాయుడు ప్రారంభించిన రోజు మాత్రమే బోగీలతో ప్రత్యేక రైలు నడిచింది. తర్వాత ప్యాసింజర్ రైలు ఒక్కటైనా నడిపించాలన్న భావనకు రైల్వేశాఖ రాలేదు.

రెండు జిల్లాలతో సింహపురికి రైలు సౌకర్యం

కృష్ణపట్నం రైల్వేలైన్‌తో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలో సింహపురి(నెల్లూరు)కి రైలు సౌకర్యం కలిగింది. విజయవాడ-చెన్నై రైలుమార్గానికి ఈలైన్ అనుసంధానం కలిగింది. ఫలితంగా 75 కిలోమీటర్ల దూరంగా తగ్గింది. అంతే కాకుండా ముంబై-చెన్నై కారిడార్ రైల్వేలైన్, విజయవాడ-చెన్నై రైలుమార్గం కనెక్టివిటీ లైన్‌గా ఆవిర్భవించినట్లైంది.ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని రైల్వేస్టేషన్ల నుంచి విజయవాడ డివిజన్ పరిధిలోని మంగంపేట, చెర్లోపల్లె, రాపూరు, అదురుపల్లె , కుసుమూరు, వెంకటాచలంరోడ్, నిడుంగటపల్లె స్టేషన్లు ఉన్నాయి.

ప్యాసింజర్‌రైళ్ల ఏర్పాటు మరిచిన రైల్వే

ఓబులవారిపల్లె-కృష్ణపట్నం రైల్వేలైన్‌లో ప్యాసింజర్ రైళ్ల ఏర్పాటును రైల్వేశాఖ మరిచిపోయిందనే విమర్శలున్నాయి. లైన్ ప్రారంభం సమయంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా ప్యాసింజర్‌రైళ్లను రన్ చేయాలని ఉన్నతాధికారులకు సూచించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ప్యాసింజర్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని అధికారులు ప్రకటించారు. ఇప్పుడు ఆ ఊసేలేకుండాపోయింది.

కొత్తరైళ్ల విషయానికి వస్తే..

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలను కలుపుతూ నెల్లూరుకు డైలీ డెమోరైలును తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.
- విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, రాపూరు, ఓబులవారిపల్లె, రాజంపేట,నందలూరు మీదుగా కడప వరకు ఎక్స్‌ప్రెస్ రైలును తీసుకువస్తే అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు.
- పెన్నా ఎక్స్‌ప్రెస్ పేరుతో హిందుపూరం నుంచి వయా ధర్మవరం, అనంతపురం గుత్తి, డోన్, నంద్యాల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కడప, నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె మీదుగా నెల్లూరు వరకు రైలును తీసుకొస్తే సీమలోని కడప, అనంతపురం, నెల్లూరు జిల్లా మధ్య రాకపోకలు సులభతరమవుతాయి.
- కర్ణాటకలోని హుబ్లీ, బళ్లారి నుంచి గుంతకల్ మీదుగా వయా కడప నుంచి కృష్ణపట్నం లైన్‌లో నెల్లూరుకు, అలాగే విజయవాడ, విశాఖకు వెళ్లేందుకు మార్గం అందుబాటులోటు ఉంటుంది.



ప్యాసింజర్ రైలు ఏర్పాటు ఉపయోగకరం



ప్యాసింజర్ రైలు ఏర్పాటు వల్ల ఉమ్మడి జిల్లాల ప్రజలు, రెతులకు బాగా ఉపయోకరం. చిట్వేలి,రాజంపేట, రైల్వేకోడూరు నుంచి బొప్పాయి, అరటి, చినీ తదితర ఉద్యానపంటలు నెల్లూరు, విజయవాడకు ఎగుమతి అవుతాయి. రైలుమార్గం ఉన్నా రైలు తిరగడంలేదు. బీజేపీ ప్రభుత్వం ప్యాసింజర్‌రైలును అందుబాటులోకి తీసుకురావాలి. -మారోతు రవినాయుడు, రాజంపేట

రైల్వేబోర్డు ఆలోచించాలి



వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నుంచి నెల్లూరుకు రాకపోకలు జరుగుతూనే ఉంటాయి. బస్సుల ద్వారానే ప్రయాణం సాగించాలి. లేకుంటే రేణిగుంటకు వచ్చి రైలు ప్రయాణం చేయాలి. సిద్ధంగా ఉన్న కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైల్వేలైనులో ప్యాసింజర్ రైలును నడిపితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆదిశగా రైల్వే బోర్డు ఆలోచించాలి. -గోపాల్, రాజంపేట

నెల్లూరు-కడప మధ్య డెమో రైలు తీసుకురావాలి



కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైల్వేలైన్‌లో ప్యాసింజర్ రైలును నడపించేలా రైల్వేబోర్డు నిర్ణయం తీసుకోవాలి. రెండుషటిల్ అయిన రన్ చేసేలా చూడాలి. రైతులు, ప్రజలకు ఉపయోగకరం. ప్యాసింజర్ రైలు ఏర్పాటు చేయాలన్నా డిమాండ్ ఐదేళ్లగా కొనసాగుతోంది. దీనిపై రైల్వే అధికారులు ఆలోచించాలి. -మర్రి కళ్యాణ్, కువైట్ వైఎస్సార్‌సీపీకో-కన్వీనర్, రాజంపేట

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

డీఈఓ మర్రెడ్డి అనూరాధ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ మర్రెడ్డి అనూరాధ

కడప ఎడ్యుకేషన్: ప్రాథమికస్థాయి నుంచే విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ మర్రెడ్డి అనూరాధ పేర్కొన్నారు. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేష్ (ఎస్ఎల్‌టీఏ) జ్ఞానకుమార్ 60 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా గురువారం కడపలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు రెండు రోజుల రిఫ్రెషన్ శిక్షణను నిర్వహించారు. ఈ శిక్షణకు జిల్లావ్యాప్తంగా 36 మండలాల నుంచి ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయులకు బోధన ప్రాముఖ్యత, విద్యార్థులకు చదువుట, రాయుట, అక్షరమాలల ప్రాధాన్యత, ఆంగ్ల డిక్షనరీ ఎలా ఉపయోగించాలనే విషయాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడి పాత్ర అనే అంశాన్ని గురించి వివరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మర్రెడ్డి అనూరాధ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే వారి భవిష్యత్తుకు మంచి పునాదులు వేయాలని సూచించారు. సమగ్రశిక్ష ఏఎంఓ ధనలక్ష్మి, డైట్ లెక్చర్ అజయ్, ఎంఈఓలు సుభాషిణి, సత్యనాగరాజు, ఏఏఎంఓ రామాంజనేయరెడ్డి, ఎస్ఎస్ఏ కార్యాలయ సిబ్బంది నరసయ్య, ఎస్ఆర్పీలు పాల్గొన్నారు.

విత్తనాలకు బిల్లులు తప్పనిసరి

జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు



కడప అగ్రికల్చర్: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు డీలర్ల నుంచి విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు వారి నుంచి కచ్చితంగా బిల్లులు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు అన్నారు. ప్రభుత్వ వ్యవసాయశాఖ కమీషనర్ ఉత్తర్వుల మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా 233 విత్తన వ్యాపారం నిర్వహిస్తున్న దుకాణాలను అయా మండల వ్యవసాయ అధికారులతో తనిఖీలు చేయించినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా దుకాణాలను నిర్వహిస్తున్న డీలర్ల లైసెన్సు నిర్ధారణ, చెల్లుబాటు తేదీలను పరిశీలించామని పేర్కొన్నారు. అలాగే విత్తనాలను కొనుగోలు చేసిన రైతులకు బిల్లులను డీలర్లు ఇచ్చారా లేదా అని బిల్‌బుక్కులను కూడా పరిశీలించినట్లు తెలిపారు. అలాగే విత్తల డీలర్లు రకాల విత్తనాల వివరాలను సంబంధిత స్టాక్ రిజిస్టర్‌లో ప్రతి రోజు అప్‌డేట్ చేస్తున్నారా లేదా అని కూడా పరిశీలించడం జరిగిందన్నారు. అలాగే ప్రారంభ నిల్వ , ముగింపు నిల్వలు సరిగ్గా ఉన్నాయా లేదా అని కూడా పరిశీలించారన్నారు. రైతులు డీలర్ల నుంచి విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని కోరారు. అలాగే విత్తనాల నాణ్యతపై ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే సంబంధిత మండల వ్యవసాయ అధికారి , సహాయ వ్యవసాయ సంచాలకులకు సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అంతేకాక ఎక్కడైనా ధ్రువీకరించని విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిసిన వెంటనే ఆయా మండలాల వ్యవసాయ అధికారులు సమాచారం ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు సూచించారు.

వైభవం..పల్లకీ ఉత్సవం




పల్లకీలో ఊరేగుతున్న వీరభద్రస్వామి

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. గురువారం అమావాస్య సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ,ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

జిల్లాలో వర్షం

కొండాపురంలో 114.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



కడప అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఊదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి వల్లూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, బద్వేల్, బి.మఠం, కాశినాయన, కలసపాడు, గోపవరం , మైదుకూరు మండలాల మినహా మిగతా 27 మండలాల్లో వర్షం కురిసింది. పులివెందుల, జమ్మలమడుగు డివిజన్ల పరిధిలోని 18 మండలాల్లో వాన దంచి కొట్టింది. కొండాపురం, సింహాద్రిపురం, మైలవరం, పులివెందుల, వీఎన్‌పల్లె మండలాల్లో భారీ వర్షం కురిసింది. కొండాపురంలో అత్యధికంగా 114.6 మిల్లీమీటర్లు, ఖాజీపేటలో అత్యల్పంగా 0.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షంతో జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించిన వ్యవసాయ పనులు ప్రారంభంకానున్నాయి.

మండలం కురిసిన వర్షం(మి.మీ)

కొండాపురం	114.6	చెన్నూరు	15.0
సింహాద్రిపురం	80.8	పెద్దముడియం	14.4
మైలవరం	46.8	దువ్వూరు	9.6
పులివెందుల	40.2	పోరుమామిళ్ల	8.2
వీఎన్ పల్లె	40.0	కడప	8.2
లింగాల	39.2	కమలాపురం	6.2
వేముల	33.2	పెండ్లిమర్రి	5.2
జమ్మలమడుగు	29.4	రాజుపాలెం	4.8
చక్రాయపేట	25.0	చాపాడు	4.2
వేంపల్లె	23.6	ఎర్రగుంట్ల	3.4
ముద్దనూరు	21.6	సీకేదిన్నె	3.2
తొండూరు	17.2	ఖాజీపేట	0.6

టీకాయే పశువులకు రక్ష

- సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు ముందే టీకాలు
- జిల్లాకు 65,250 హెచ్ఎస్ వ్యాక్సిన్ డోసులు రాక
- జిల్లాలో ప్రారంభమైన టీకా కార్యక్రమం
- ఇప్పటిదాకా 10,015 పశువులకు, 1,41,137 గొర్రెలకు వ్యాక్సినేషన్
- జిల్లాలో ముమ్మరంగా ఉచిత టీకాల కార్యక్రమం



వ్యాక్సినేషన్ కార్యక్రమంలో సూచనలు ఇస్తున్న జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ (ఫైల్)

కడప అగ్రికల్చర్: నైరుతి రుతు పవనాలు వచ్చేశాయి. వాన చినుకులు చల్లగా పలకరిస్తున్నాయి. ఇప్పుడే అక్కడక్కడ భారీ వర్షాలు కూడా పడుతున్నాయి. దీంతోపాటు ఈ సీజన్‌లో పశువులను సీజనల్ వ్యాధులూ వస్తాయి. కొత్తగా పశుగ్రాసం మొలకెత్తుతుంది. ఈ మొలకెత్తిన పశుగ్రాసాన్ని తినడంతోపాటు సీజనల్‌గా పశువులు, ఆవులు, ఎద్దులు, బర్రెలకు గొంతువాపు వ్యాధి, గొర్రెలు, మేకలు, పొట్టేళ్లకు చిటెక వ్యాధి వ్యాపించే అవకాశాలున్నాయి. వీటి నివారణకు పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఉచితంగా టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

నల్లజాతి పశువుల్లో గొంతువాపు వ్యాధి


నల్లజాతి పశువులైన బర్రెలు, దున్నల్లో ప్రస్తుత సీజన్‌లో అధికంగా గొంతవాపు వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వ్యాపించిన పశువుల్లో పశువుల్లో గొంతు కింద భాగం వాపులుంటాయి. దీంతోపాటు ఊపిరితిత్తుల్లో నెమ్ముచేరుతుంది. తద్వారా పశువులకు ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఆయాసం, గురకతోపాటు తీవ్రమైన జ్వరంతో ఆహారం తీసుకోలేక మృత్యువాత పడే అవకాశాలు ఉంటాయి. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి చికిత్సలు అందించాల్సి ఉంటుంది. ఈ గొంతువాపు వ్యాధి నివారణకు తప్పని సరిగా టీకాలను వేయించుకోవాలి.

తెల్లజాతి పశువుల్లో జబ్బువాపు వ్యాధి

ప్రస్తుత సీజన్‌లో తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, లేగదూడలకు జబ్బువాపు వ్యాధి వ్యాప్తిస్తుంది. ఈ వ్యాధి వ్యాపించిన పశువులకు జబ్బ, వెన్ను, తోడ తదితర కండగల శరీర భాగాల్లో నల్లటి వాపు కనిపిస్తుంది. దీంతో పశువులకు జ్వరం రావడం, మేత మేయకపోవడం, కదలలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలున్న పశువులకు వెంటనే చికిత్స చేయించాలి. సకాలంలో చికిత్స చేయించపోతే పశువులు మరణించే అవకాశాలు ఉంటాయి. ఈ జబ్బువాపు వ్యాపించడానికి ముందు పశువులకు టీకా వేయించాలి.

టీకా కార్యక్రమం ప్రారంభం...

జిల్లాలో ఆవులు, గేదెలు 4,34,912 ఉండగా గొర్రెలు, మేకలు 13,46,266 ఉన్నాయి. వీటికి వ్యాధులు రాకుండా ముందస్తుగా వాక్సిన్ కార్యక్రమంలో భాగంగా టీకా కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించారు. వైఎస్సార్ జిల్లాలో పశువులకు సంబంధించి 32,112 హెచ్ఎస్ వ్యాక్సిన్ డోసులు వచ్చాయి. వీటిలో ఇప్పటివరకు 10,015 పశువులకు వ్యాక్సిన్‌ను వేశారు. గొర్రెలకు సంబంధించి ఈటి వ్యాక్సినేషన్ 2,52,900 డోసులు వచ్చాయి. ఇప్పటి వరకు 1,41,137 వాటికి వ్యాక్సినేషన్ వేయడం జరిగింది. అలాగే ఆవులు, గేదెలకు బడిసెల నివారణకు బి క్యూ వాక్సినేషన్‌కు సంబంధించిన ఇప్పటి వరకు 1512 పశువులకు వాక్సిన్ చేసినట్లు పశువైద్యాధికారులు తెలిపారు.



గొర్రె, మేకల్లో చిటికె వ్యాధి

గొర్రెలు, మేకలు తొలకరి వర్షాలు కురిశాక మొలిచిన లేతగడ్డిని ఎక్కువగా మేసినప్పుడు వాటిల్లో ఉండే బాక్టిరియా, క్రిములు జీవుల శరీరంలోకి వెల్లడం ద్వారా చిటికెవ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వ్యాపించిన జీవాలకు వెంటనే చికిత్సలు నిర్వహించచపోతే చనిపోయే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి వ్యాపించకుండ ఉండేందుకు ముందు జాగ్రత్తగా టీకాను వేయించాలి.

టీకాలు వేయించడం చాలా మంచిది



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తెల్ల, నల్లజాతి పశువులతోపాటు జీవాల్లో అధికంగా వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. ముందు జాగ్రత్తగా వాటి సంరక్షణకు పశువులకు, జీవాలకు తప్పకుండా టీకాలు వేయించుకోవాలి తద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించుకోవచ్చు. పశువులకు ఏదైనా అత్యవసర చికిత్సలు నిర్వహించాల్సి వస్తే 1902కు ఫోన్ చేస్తే సంచార వాహన సిబ్బంది వచ్చి వైద్య సేవలందిస్తారు. ప్రభుత్వం ఉచితంగా వేస్తున్న టీకాలను తప్పకుండా వేయించుకోవాలి. - డాక్టర్. శారదమ్మ, జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా పార్లమెంటరీ కమిటీ

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో ఎన్నికల తర్వాత భయానక వాతావరణం నెలకొన్న నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, సోషల్ మీడియా సైనికులకు అండగా నిలిచేందుకు కడప పార్లమెంటరీ నియోజకవర్గానికి ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ మూకలు ఎక్కడికక్కడ దాడులు చేస్తున్నాయి. ఈ సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు తోడుగా నిలిచేందుకు 25 పార్లమెంటు నియోజకవర్గాలకు ఆ పార్టీ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు కార్యకర్తలకు, అక్కచెల్లెమ్మలకు, అన్నదమ్ముళ్లకు, సోషల్ మీడియా సైనికులకు తోడుగా నిలవనున్నాయి. బాధిత కుటుంబాలను పరామర్శించడమేగాకుండా వారికి న్యాయపరంగా, వైద్య పరంగా, ఆర్థికపరంగా సహాయంగా నిలుస్తాయి.

- కడప పార్లమెంటరీ నియోజకవర్గ కమిటీలో మేయర్ కొత్తమద్ది సురేష్ బాబు, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రాచగొల్ల రమేష్‌యాదవ్, డీసీ గోవిందరెడ్డి, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డా. దాసరి సుధ, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, మూలే సుధీర్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, రఘురామిరెడ్డిలను సభ్యులుగా నియమించారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

చింతకొమ్మదిన్నె : మండలంలోని అంగడి వీధి గ్రామానికి చెందిన సురేంద్ర (48) అనే వ్యక్తి గురువారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు చింతకొమ్మదిన్నె ఏఎస్ఐ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు ఇటీవల కాలంలో ఆయన కుమార్తెకు పెళ్లి సంబంధాలు చూడగా అందులో ఒక సంబంధాన్ని నిశ్చయించినట్లు తెలిసింది. ఈ సంబంధం తన భార్యతో పాటు, కుమార్తెకు ఇష్టం లేకపోవడంతో మనస్థాపానికి గురై ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

మంగపట్నం చెరువుకు గండి



మంగపట్నం చెరువుకు గండి పడిన చోట బయటికి వెళుతున్న నీరు

ముద్దనూరు : మండలంలోని మంగపట్నం గ్రామ చెరువుకు గండి పడింది. బుధవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షంతో చెరువులోకి నీళ్లు చేరాయి. గురువారం తెల్లవారుజామున చెరువుకు గండి పడడంతో చెరువులోని కొంతనీరు వృథా అయిందని గ్రామస్తులు తెలిపారు. చెరువుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

టి.సంద్రపల్లెలో ట్రాక్టర్ చోరీ



చోరీకి గురైన ట్రాక్టర్

గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లె సింగిల్‌విండో అధ్యక్షుడు నారపురెడ్డి వేణుగోపాల్‌రెడ్డికి చెందిన ఏపీ39 ఎన్‌సి 9013 నంబరు గల మహీంద్ర 575 డీఐ ట్రాక్టర్ బుధవారం అర్ధరాత్రి చోరీకి గురైంది. రోజూ మాదిరే ట్రాక్టర్‌ను ఇంటి ముందు భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో ఉంచారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను తీసుకెళ్లారు. ఉదయం లేచి చూసేసరికి ట్రాక్టర్ లేకపోవడంతో చుట్టుపక్కల విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో బద్వేలు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా ట్రాక్టర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 2022 మోడల్‌కు చెందిన ఈ ట్రాక్టర్‌ను వేణుగోపాల్‌రెడ్డి కొనుగోలు చేశారు. కాగా వైఎస్సార్‌సీపీలో కీలక నాయకుడిగా వేణుగోపాల్‌రెడ్డి పనిచేస్తున్నారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసిన 24 గంటల లోపలే తన ట్రాక్టర్‌ను తీసుకెళ్లడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

రామాపురం : మండలంలోని చిట్లూరు పంచాయతీ పరిధిలో కొండావాండ్లపల్లె సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసుల ఆధ్వర్యంలో ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ వి.లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు.

రీసెర్చ్‌హబ్‌గా వైవీయూ

యోగివేమన విశ్వవిద్యాలయం పరిశోధనలకు పెద్దపీట వేస్తోంది.. విశ్వవిద్యాలయంలో పనిచేసే అధ్యాపకుల్లో సింహభాగం కీలక పరిశోధనలు కొనసాగిస్తున్నారు. తాజాగా రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) 2.0లో భాగంగా రూ.3.49 కోట్లతో 52 ప్రాజెక్టులను మంజూరు చేసింది.



వైవీయూ ప్రధాన ద్వారం



ల్యాబ్‌లో విద్యార్థులు

- పరిశోధనలను ప్రోత్సహిస్తున్న విశ్వవిద్యాలయం
- తాజాగా వైవీయూకు 52 పరిశోధక ప్రాజెక్టులు
- రూ. 3.49 కోట్ల కేంద్ర నిధులు మంజూరు

వైవీయూ : వెయ్యిమైళ్ల ప్రయాణమైనా.. ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది.. అదే విధంగా అద్భుత ఆవిష్కరణలు సైతం ఎన్నో వైఫల్యాల నుంచే సాధ్యమవుతాయి.. ఎంతో ఓపిక, విషయజ్ఞానం, తర్కం, జిజ్ఞాస, సమాచార లభ్యత, నిరంతర పరిశోధన చేస్తేనే అద్భుతమైన ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. ఒక్క పరిశోధన చాలు దేశానికి అద్భుతమైన మైలేజీ ఇచ్చేందుకు అంతటి ప్రాధాన్యత కలిగిన పరిశోధనలకు యోగివేమన విశ్వవిద్యాలయం చక్కటి ప్రాధాన్యత ఇస్తోంది.

52 ప్రాజెక్టులు మంజూరు..

యోగివేమన విశ్వవిద్యాలయానికి ప్రతిష్టాత్మకంగా 52 పరిశోధక ప్రాజెక్టులు మంజూరు అయ్యాయి. రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ 2.0 కింద కేంద్ర ప్రభుత్వం రూ.3.49 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా రూ. 1.53 కోట్లు విడుదల చేయడం విశేషం. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఫెలోషిప్‌లు ఇవ్వడానికి పరిశోధన అవసరాలు, వినియోగం కోసం, ఆధునిక పరికరాల కొనుగోలు, నాణ్యమైన పరిశోధనలు చేసేందుకు దోహదపడనుంది. 52 మంది ఆచార్యులు, సహ ఆచార్యులు పరిశోధక ప్రాజెక్టులను నిర్వహించనున్నారు. రూసా 1.0 ద్వారా విడుదలై రూ.20 కోట్ల నిధులను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు, ఆధునిక పరిశోధనలకు బీజం వేయడం ద్వారా రూసా 2.0 నిధుల విడుదలకు లైన్‌క్లియర్ అయింది.

రూసా నిధులతో సౌకర్యాలు

పీఎం ఉష (రూసా) కింద దేశంలోని ప్రతిష్టాత్మకమైన 78 సంస్థలను చేసి ఒక్కో సంస్థకు రూ. 20 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. అందులో యోగివేమన విశ్వవిద్యాలయం ఉండడం గమనార్హం. ఈ నిధులతో 10 కోట్లు వెచ్చించి నూతన అకడమిక్ భవన నిర్మాణం, మరో 6 కోట్లతో నూతన పరిశోధన పరికరాల కొనుగోలు చేపట్టనున్నారు. రూ.4 కోట్లతో కంప్యూటర్లు, ఇంటర్నెట్ ప్యానల్స్, ఎంఓయూ పోర్టర్లు, విద్యార్థుల తల్లిదండ్రులకు వెయిటింగ్ హాల్, రెస్ట్ రూమ్‌లు వంటివి అందుబాటులోకి తెచ్చేందుకు వైవీయూ అధికారులు ప్రణాళికలు రూపకల్పన చేశారు. వీటితో పాటు తాజాగా ప్రమోషన్ ఆఫ్ యూనివర్సిటీ రీసర్చ్ అండ్ సైంటిఫిక్ ఎక్సలెన్సీ (పీయూఆర్ఎస్ఈ) కింద ప్రతిపాదనలను పంపించారు. సైన్స్‌లో ఆధునిక పరిశోధనల కోసం గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలకు కేంద్ర ప్రభుత్వం 'పీయూఆర్ఎస్ఈ' కింద నిధులు అందజేస్తుంది. అలానే ఫండ్ ఫర్ ఇంప్రూవ్‌మెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఫిస్ట్) కోసం వైవీయూలోని బోటనీ, బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ శాఖలు నిధుల కోసం ప్రతిపాదనలను పంపాయి. ఇప్పటికే గతంలో ఫిస్ట్ కింద నిధులు పొంది పరిశోధనలు విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్నాయి.

నాణ్యమైన పరిశోధనలకు కేరాఫ్ వైవీయూ



విశ్వవిద్యాలయం బోధన, పరిశోధన పరంగా నిపుణులైన అధ్యాపకులు ఇక్కడ ఉన్నారు. నాణ్యమైన పరిశోధనలు చేస్తున్నందువల్లే ప్రతిష్టాత్మకమైన కేంద్ర ప్రభుత్వ సంస్థలు నిధులు మంజూరు చేస్తున్నాయి. తద్వారా అకడమిక్, రీసెర్చ్ పరంగా విద్యార్థులకు విశ్వవిద్యాలయానికి అత్యంత ప్రయోజనకరం.

- ఆచార్య చింతా సుధాకర్, వైస్ చాన్సలర్, వైవీయూ

ప్రాజెక్టులతో పరిశోధనలు పరుగు..



రాష్ట్రంలో అత్యధిక ప్రాజెక్టులు పొందిన విశ్వవిద్యాలయంగా వైవీయూ నిలుస్తోంది. ఒకేసారి 52 మంది పరిశోధకులకు ప్రాజెక్టులు మంజూరు కావడం అంటే అంత సామాన్య విషయం కాదు. విశ్వవిద్యాలయం పట్ల పట్ల ఉన్న నమ్మకమే ఇందుకు కారణం. వైవీయూను పరిశోధనల్లో మేటిగా నిలవడం సంతోషంగా ఉంది.

- ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్, వైవీయూ

విద్యార్థుల భవిష్యత్తుకు ప్రయోజనకరం



ప్రస్తుత పరిస్థితుల్లో నిధులు, ప్రాజెక్టులు రావడం విద్యార్థుల భవిష్యత్తుకు అత్యంత ఉపయోగకరం. విశ్వవిద్యాలయ ర్యాంకింగ్ పెరగడంలోను ఇవి దోహదపడతాయి.

- డాక్టర్ టి. చంద్రశేఖర్, పీఎం ఉష (రూసా) కోఆర్డినేటర్, వైవీయూ

కువైట్ యాదవ సంఘం చేయూత



రాజు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కుటుంబానికి కువైట్ యాదవ సంఘం అండగా నిలిచింది. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన దుగ్గినేనిరాజు గత నెల 20న పని నిమిత్తం పోరుమామిళ్లకు వెళుతున్న సమయంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌పై పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అప్పటి నుంచి కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సుమారు రూ.5 లక్షల మేర ఖర్చు చేశారు. మరిన్ని వైద్య ఖర్చుల కోసం డబ్బు అవసరముంది. అయితే రాజు నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న కువైట్ యాదవ సంఘం అధ్యక్షుడు చల్లాబాబుయాదవ్ ఆధ్వర్యంలో రూ.50 వేలు, కువైట్‌లో పనిచేస్తున్న పలువురు యాదవుల సహాయంతో మరో రూ.1.26 లక్షలు సమకూర్చారు. ఈ మేరకు మొత్తం రూ.1.76 లక్షల నగదును గురువారం నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు బుర్రిరాజాయాదవ్‌తో పాటు పలువురు కడపకు వెళ్లి రాజు కుటుంబానికి నగదు అందజేశారు.

ల్యాప్‌ట్యాప్‌ల చోరీ

ముద్దనూరు : మండలంలోని శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలోని ల్యాప్‌ట్యాప్‌లు చోరీకి గురైనట్లు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు నల్లబల్లె సమీపంలోని డిగ్రీ కళాశాల గత నెలలో సెలవుల కారణంతో మూసివేశారు. తిరిగి గురువారం కళాశాలలోకి వెళ్లి చూడగా 10 ల్యాప్‌ట్యాప్‌లు చోరీకి గురైనట్లు యాజమాన్యం గుర్తించింది. ఈ మేరకు పోలీసులకు కళాశాల కరెస్పాండెంట్ చక్రధర్ రెడ్డి ఫిర్యాదు చేశారు.

డాక్టర్ సుధాకర్‌రెడ్డికి రూసా పరిశోధక ప్రాజెక్టు

రూ.10 లక్షల ప్రాజెక్టు దక్కించుకున్న ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు



డాక్టర్ బుసిరెడ్డి సుధాకరరెడ్డికి రూసా ప్రాజెక్టు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల భౌతికశాస్త్ర ఆచార్యులు డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డికి రూసా పరిశోధక ప్రాజెక్టు లభించింది. రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) 2.0లో భాగంగా ఈయనకు రూ.10 లక్షల మేజర్ పరిశోధక ప్రాజెక్టును మంజూరు చేశారు. పరిశోధక ప్రాజెక్టు మంజూరు ఉత్తర్వులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ పరిశోధక ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ బి. సుధాకర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అధ్యాపకునికి రూసా 2.0 కింద రూ.10 లక్షల మేజర్ ప్రాజెక్టు మంజూరు కావడం అభినందనీయమన్నారు. డాక్టర్ బి. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం అనుసరించి భావితరాలకు ఉపయోగపడే పరిశోధనల కోసం 'స్పెక్ట్రోస్కోపిక్ ఇన్వెస్టిగేషన్ ఆన్ రేర్ ఎర్త్ అయాన్స్ డోప్‌డ్ జింక్ కాడ్మియం టెల్లూరియం టంగ్‌స్టాన్ బోరోఫాస్ఫేట్ గ్లాస్సెస్ ఫార్ హైపవర్ నియర్ ఇన్‌ఫ్రారెడ్ సాలిడ్ స్టేట్ లేజర్స్ అండ్ ఫైబర్ ఆంప్లిఫయర్స్' అన్న అంశంపై పరిశోధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాగా ఈయన గతంలో యూజీసీ, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆధ్వర్యంలో రూ.53 లక్షల మేర 3 మేజర్, 2 మైనర్ పరిశోధక ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తిచేశారు. ఈయన రాసిన 75 పరిశోధన పత్రాలను జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారు. కాగా ఇటీవలే ఈయన న్యాక్ పీర్ కమిటీ సభ్యుడిగా కూడా ఎంపికయ్యారు.

కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు అఫ్జల్ ఖాన్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు మంచి ఆదరణ చూపారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు అఫ్జల్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఒక్క రూపాయి కూడా డబ్బు పంపిణీ చేయలేదన్నారు. తమ పార్టీపై అభిమానంతో ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు, ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలకు ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తమది ఓటమి కాదని గెలుపేనన్నారు. కేవల 15 రోజుల్లో ప్రజలు తమను బాగా ఆదరించారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల సమస్యలను తీరుస్తామన్నారు. ముస్లిం ఓట్లు వైఎస్సార్‌సీపీకి అవసరం లేదని అంజద్ బాషా చెప్పడం సిగ్గుచేటన్నారు. అఫ్జల్ ఖాన్‌కు 2వేల ఓట్లు కూడా రావు అని చెప్పారని కానీ 24,500 ఓట్లు ప్రజలు వేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తన గురించి తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుంచపు సుబ్బమ్మ (68) మృతి చెందింది. ఎస్ఐ రామకృష్ణ వివరాల మేరకు డీసీ వడ్డిపల్లెకు చెందిన సుబ్బమ్మ గురువారం సొంత పనుల నిమిత్తం రాయచోటికి వెళ్లేందుకు సమీపంలోని బస్టాండ్ వద్దకు వచ్చింది. ఈ క్రమంలో ఎర్రమొర్రంపల్లె-రాయచోటి షటిల్ సర్వీసు ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా బస్సు తగిలి పడిపోయింది. ఈ ప్రమాదంలో సుబ్బమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడులు

రాయచోటి : వేరుశనగ సాగులో మేలైన యాజమాన్యం పాటించితే మంచి దిగుబడి పొందేందుకు వీలుంటుందని అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ తెలిపారు. మేలైన యాజమాన్య పద్ధతులు, విత్తనాలపై ప్రభుత్వ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు నిర్ధారించారని ఆయన పేర్కొన్నారు. నూనె గింజల పంటల్లో ప్రధానమైన పంట వేరుశనగ ముందుందన్నారు. జిల్లాలో రైతులు అధిక విస్తీర్ణంలో వర్షాధారంగా వేరుశనగను సాగు చేస్తారన్నారు. ప్రాంతాన్ని బట్టి ఆయా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఖరీఫ్ వేరుశనగను జూన్ నుంచి ఆగస్టు వరకు సాగు చేస్తారని వివరించారు. పాత రకాల స్థానంలో ప్రస్తుతం అధిక దిగుబడినిచ్చే అనేక నూతన రకాల విత్తనాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అయితే సాగులో మేలైన యాజమాన్యం పాటించినట్లయితే మంచి దిగుబడి పొందేందుకు వీలుంటుందన్నారు. రాయలసీమ వ్యాప్తంగా కొత్త రకం వంగడాల విత్తనాలను ఎక్కువగా చేస్తారని వివరించారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్టు

10.5 కిలోల గంజాయి, మోటార్‌సైకిల్, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం



గంజాయి కేసులో అరెస్టయిన వారి వివరాలను తెలియజేస్తున్న కడప టూటౌన్ సీఐ ఇబ్రహీం

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు, కడప డీఎస్పీ ఎం. షరీఫ్ పర్యవేక్షణలో కడప టూటౌన్ సీఐ జి. ఇబ్రహీం ఆధ్వర్యంలో పోలీసులు, వారి సిబ్బంది గంజాయి అక్రమ రవాణా, అమ్మే వారిపై గట్టిగా నిఘా ఉంచారు. ఈ మేరకు సీఐ ఇబ్రహీం, ఎస్ఐలు ఎం.ఎన్. సంజీవ రాయుడు, ఎంఏ ఖాన్‌లు తమ సిబ్బందితో కలిసి గురువారం మాసాపేట, దొరలగోరీలు ప్రాంతాలలో నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో కడప నగరం మేకలదొడ్డికి చెందిన షేక్ సమీర్(22), మాసాపేటకు చెందిన షేక్ మహమ్మద్ గౌస్, షేక్ మహమ్మద్ రఫీ, షేక్ సమీర్ (18) ఉన్నారు. వీరితో పాటు ఓ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 10.5 కిలోల గంజాయిని, మోటార్ సైకిల్‌ను, ఐదు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ ఇబ్రహీం వెల్లడించారు.

టీడీపీ విజయోత్సవంలో వివాదం



బి.కొత్తకోటలో టీడీపీ వర్గాల వాగ్వాదం

బి.కొత్తకోట : విజయోత్సవం సందర్భంగా బి.కొత్తకోటలో టీడీపీ వర్గాల మధ్య చోటుచేసుకున్న స్వల్ప వివాదంతో భారీస్థాయిలో పోలీసులు మోహరించారు. ఎన్నికల్లో టీడీపీ విజయాన్ని పురస్కరించుకుని గురువారం మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ వర్గీయులు దేవరింటి కుమార్, జిల్లా నాయకులు సుకుమార్, శ్రీనాథ్, శ్రీనివాసులు తదితరులు జ్యోతిచౌక్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో అభ్యర్థి జయచంద్రారెడ్డి వర్గీయులైన మండల టీడీపీ కన్వీనర్ డి.నారాయణస్వామిరెడ్డి, మాజీ సర్పంచ్ కుడుం శ్రీనివాసులు, పీహెచ్‌సీ కమిటీ మాజీ చైర్మన్ కనకంటి ప్రసాద్ తదితరులు కార్యక్రమాల నిర్వహణపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అందరం కలిసి ఒకే వేదికపై సంబరాలు నిర్వహించుకుందామని నచ్చజెప్పారు. దీన్ని శంకర్ వర్గం వ్యతిరేకించడంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు శంకర్ వర్గీయులు కలిసి వేడుక జరుపుకునేందుకు అంగీకరించడంతో అంతా కలిసి కేక్ కట్ చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ సూర్యనారాయణ అప్రమత్తమయ్యారు. భారీ స్థాయిలో పోలీసు బలగాలను రప్పించారు. టీడీపీ శ్రేణులు నిర్వహిస్తున్న కార్యక్రమం వద్దకు చేరుకుని రెండు వర్గాల మధ్య వివాదం ముదరకుండా చర్యలు తీసుకున్నారు.

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని కార్యకర్తలకు నాయకులకు అనుక్షణం అండగా ఉంటామని ఎవరూ అధైర్యపడవద్దని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బాధ్యుడు, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడవాల్సిన తరుణమిదన్నారు. నియోజకవర్గంలో పార్టీకి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఓటమికి గల కారణాలపై కార్యకర్తలతో సమీక్షించారు. అలాగే అధికారం చేపట్టిన వారు అభివృద్ధి, సంక్షేమం కొనసాగించాలని లేకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. రైల్వేకోడూరులో లక్షలాది రూపాయలతో టోల్‌గేట్ వద్ద బస్‌షెల్టర్ నిర్మిస్తే దానిని ధ్వంసం చేయడం చాలా దారుణమన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో ఎవరికి ఎలాంటి ఇబ్బంది జరిగినా పూర్తిస్థాయిలో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పొడ దుప్పిని కాపాడిన గ్రామస్తులు



కుక్కల దాడిలో గాయపడిన పొడదుప్పి

సిద్దవటం : మండలంలోని టక్కోలి గ్రామ పంచాయతీ పరిధిలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న మామిడి చెట్లలో పొడ దుప్పిపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన పొడదుప్పిని గ్రామస్తులు కాపాడారు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ ప్రాంతానికి చేరుకున్న పోలీసులు పొడదుప్పిని కడప అటవీ అధికారులకు అప్పగించారు. వారు ప్రథమ చికిత్స కోసం కడప పశువుల ఆసుపత్రికి తరలించారు.

ఫుట్‌బాల్ జోనల్ చాంపియన్ కడప



పోటీలకు హాజరైన క్రీడాకారులతో అతిథులు



విజేతగా నిలిచిన కడప జట్టుతో కోచ్‌లు, అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో గురువారం నిర్వహించిన ఫుట్‌బాల్ జోనల్‌స్థాయి టోర్నమెంట్‌లో విజేతగా కడప జట్టు నిలిచింది.

కడప, అన్నమయ్య, సత్యసాయి జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌ను కడప నగరానికి చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ వంశీధర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా చిన్నారుల్లో చురుకుదనంతో పాటు ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. ఫుట్‌బాల్ క్రీడలో రాణిస్తున్న క్రీడాకారులను ఆయన అభినందించారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డానియల్ ప్రదీప్, ఉపాధ్యక్షుడు థామస్ జీవన్‌బాబు, కార్యదర్శి సుధీర్, డీఎస్ఏ శిక్షకుడు ఎస్.వి.పి. అమృతరాజ్, క్రీడాపాఠశాల ఫుట్‌బాల్ కోచ్ ఎం. హరి మాట్లాడుతూ ఫుట్‌బాల్ క్రీడలో రాణించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. జోనల్‌స్థాయిలో విజేతలుగా నిలిచే జట్టు ఈనెల 7,8 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో కడప జట్టు విన్నర్‌గా నిలువగా, సత్యసాయి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది.

నిర్ధారణతోనే క్యాన్సర్ నివారణ సాధ్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కొండయ్య

మదనపల్లె: సరైన వైద్య పరీక్షల ద్వారా క్యాన్సర్ వ్యాధిని నిర్ధారణ చేస్తే నివారణ సాధ్యమవుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డి ఎం అండ్ హెచ్ ఓ) కొండయ్య అన్నారు.గురువారం స్థానిక సర్వజన బోధనాస్పత్రిలోని డైక్ సెంటర్లో జరుగుతున్న రెండు రోజుల క్యాన్సర్ శిక్షణ శిబిరాన్ని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శివ ప్రతాప్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...హోమి బాబా క్యాన్సర్ ట్రైనింగ్ సెంటర్ లో శిక్షణ పొందిన ఎస్వీ మెడికల్ కాలేజి వైద్య బృందం జిల్లాలోని అన్ని సీహెచ్‌సీ ఆసుపత్రిలోని గర్భకోశ వ్యాధి నిపుణులు, దంత వైద్యులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు . ముఖ్యంగా సర్వైకల్, బ్రెస్ట్ (రొమ్ము), నోటి క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన వైద్యులు ఈనెల 11వ తేదీ నుంచి గ్రామస్థాయిలోని ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓ లకు క్యాన్సర్ వ్యాధిపై శిక్షణ ఇస్తారన్నారు. 30 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికి గ్రామస్థాయిలోనే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వ్యాధిని గుర్తించనున్నట్లు చెప్పారు. క్యాన్సర్ నివారణలో స్క్రీనింగ్ పరీక్షలు చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ జమున, సూపరింటెండెంట్ ఎమ్మెస్ రాజు,జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలి దేవి, నోడల్ ఆఫీసర్లు వెంకటలక్ష్మి, సౌమ్యపల్లవి, తదితరులు పాల్గొన్నారు.